క్లుప్తంగా

బాలలను పనిలో పెడితే కఠిన చర్యలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న లేబర్ ఆఫీసర్, తదితరులు

నరసన్నపేట: దుకాణాలు, వ్యాపార సంస్థల్లో బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని స్థానిక లేబర్ ఆఫీసర్ విభూది జయ శంకర్ అన్నారు. పట్టణంలోని వస్త్ర దుఖాణాల తోపాటు పలు సంస్థల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దపేటలో ర్యాలీ నిర్వహించారు. వెట్టి చాకిరీ కార్మికులను గుర్తించడంతోపాటు, బాలకార్మికులు ఎక్కడైనా ఉన్నారా అని తనిఖీలు చేశామన్నారు. అవగాహన ర్యాలీలో ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ పూడి జనార్దనరావు, సీఆర్పీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంతాపం



వడగ అప్పారావు (ఫైల్)

పొందూరు: పొందూరుకు చెందిన ఖాదీ విశ్రాంత ఉద్యోగి వడగ అప్పారావు (92) ఇటీవల మృతి చెందారు. ఖాదీ విలేజ్ కమిషన్ (మహారాష్ట్ర)లో సూపర్‌వైజర్‌గా పనిచేశారు. ఈయన మృతికి పొందూరు ఏఎఫ్‌కేకే సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, దండా వెంకటరమణ బుధవారం సంతాపం తెలిపారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని దూసి గ్రామంలో యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్ఎస్టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఏటీఎం పిన్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్టీ జిల్లా కోఆర్డినేటర్ ఎ.హరినాథ్, సీఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.

కాలువలను కప్పేస్తున్న ఇసుకాసురులు

- 100 ఎకరాల సాగుకు ప్రశ్నార్థకం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు



కాలువను కప్పేసి రోడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

హిరమండలం: మండలంలో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రైతుల పంట కాలువలపై రహదారులు వేసి ఇసుక తరలించుకుపోతున్నారు. దీంతో నీలాదేవిపురం, పిండ్రువాడ పరిధిలో వందలాది ఎకరాల పంట భూములకు సాగునీరు అందకుండా పోతోంది. వంశధార ఎడమ కాలువ నుంచి అనుసంధానంగా 4-ఆర్ కాలువ ఉంది. ఈ కాలువకు మూడుచోట్ల అడ్డంగా మట్టి వేసి ఇసుక తరలించేందుకు వీలుగా రోడ్లు వేసుకున్నారు. ప్రస్తుతం రైతులు మొక్కజొన్న పంట వేసుకున్నారు. నీరు అందక తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇదే విషయంపై గొట్టా బ్యారేజీ వంశధార డీఈఈకి రైతులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

అనుమతితోనే నిర్మాణం

పాతపట్నం: మండల కేంద్రంలోని ఉమామహల్ నిర్మాణానికి శ్రీకాకుళం జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అనుమతి ఇచ్చారని హాల్ యాజమాని సుగ్గు కృష్ణవేణి బుధవారం తెలిపారు. 2024 డిసెంబర్ 26వ తేదీన ఉమామహల్‌ను నాన్ ఏసీ నుంచి ఏసీ చేయడానికి అనుమతి ఇచ్చారన్నారు. బీ ఫామ్, లైసెన్స్ కూడా జారీ చేశారన్నారు.

పీఎంపీబీవైని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

సారవకోట: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంపీబీవై)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథ స్వామి సూచించారు. మండలంలోని బుడితి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రబీలో వరి పంటకు వచ్చే తెగుళ్లు, వినియోగించాల్సిన మందులు, ఎరువులపై అవగాహన కల్పించారు. జిల్లా కార్యాలయం సహాయ సంచాలకులు భవానీశంకర్, నరసన్నపేట ఏడీ రవీంద్ర భారతి, ఏఓ వెంకటరావు, వీఏఏ దిలీప్ సాహు పాల్గొన్నారు.

నరకయాతన!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఆమదాలవలస నియోజకవర్గంలోని లింక్ రహదారుల వివరాలు..

మండలం	లింక్ రోడ్లు	శిథిలమైనవి
సరుబుజ్జిలి	26	16
బూర్జ	30	20
ఆమదాలవలస	45	31
పొందూరు	56	38



విజయరాంపురంలో గోతులమయంగా ఉన్న రోడ్డు



అధ్వానంగా ఉన్న చినషళంత్రి రహదారి

సరుబుజ్జిలి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు కుమ్మరిస్తున్నామని కూటమి పాలకులు చెబుతున్నారు. ఆచరణలో కానరావడం లేదు. గ్రామస్తుల్లో సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో సుమారు 230 గ్రామాలకు సంబంధించి దాదాపు 56 కిలో మీటర్ల మేర రోడ్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో 115 రహదారులు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయి. వీటి నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వలన వర్షాలు, వరదల సమయాల్లో ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి.

ముందుకు సాగని అంతర్ రహదారులు

చిన్న, చిన్న గ్రామాల మధ్య సంబంధాలను మెరుగుపరచే అంతర్ రహదారులు చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. కుగ్రామాలకు పోవాలంటే చుట్టూ తిరిగి ప్రయాణించకుండా తక్కువ దూరంలో లింక్ రోడ్ల ద్వారా ప్రజలు ప్రయాణాలు చేయవచ్చు. ప్రస్తుతం ఆయా రహదారులు పూర్తిగా అధ్వనంగా ఉన్నాయి.

బాగు చేయాల్సిన రోడ్లు ఇవే..

సరుబుజ్జిలి మండలంలోని ప్రధాన రహదారి నుంచి చిన్నషళంత్రి, బుడ్డివలస, వ్యాసులుపేట, పెద్దపాలెం, చిన్నపాలెం, కొండవలస, చినమతలబుపేట, వెన్నెలవలస తదితర గ్రామాల లింక్ రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షా కాలంలో నీరు నిల్వ చేరి బురద గుంటలను తలపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుయాల కోసం ఆయా గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బూర్జ, ఆమదాలవలస, పొందూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి.

మరమ్మతులు లేవు



మాది చిన్న గ్రామం. ప్రధాన రహదారి నుంచి మా గ్రామానికి సుమారు 2 కిలో మీటర్ల మేర అధ్వానంగా ఉంది. మరమ్మతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు పడే సమయంలో గ్రామం నుంచి రాకపోకలు చేసేందుకు విద్యార్థులు, ఉద్యోగులు నరకయాతన పడుతున్నారు.

– బి.పూర్ణారావు, వ్యాసులపేట, సరుబుజ్జిలి మండలం

రహదారులు నిర్మించాలి



కొండవలస నుంచి చిన్నపాలెం, పెద్దపాలెం లింక్ రహదారుల నిర్మాణాలు జరగలేదు. దీనివలన ఆయా రహదారుల్లో అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనాలు రావడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే రహదారులు నిర్మించాలి.

– ఎల్.విశ్వేశ్వరరావు, కొండవలస, సరుబుజ్జిలి మండలం

ప్రతిపాదనలు పంపించాం

అంతర్ రహదారులతోపాటు లింక్ రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాల కోసం అంచనాలు తయారుచేసి ప్రతిపాదనులు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– కూర్మనాథ్, పీఆర్ జేఈ, సరుబుజ్జిలి మండలం

కానరాని ఎన్నికల కోడ్



పెద్దలోగిడిలో ఉన్న ఫ్లెక్సీ



సీది గ్రామానికి వెళ్లే రహదారిలోని విద్యుత్ స్తంభానికి ఉన్న ఫ్లెక్సీలు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకుల ఫ్లెక్సీలు యథావిధిగా ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో దర్శనమిస్తున్నాయి. మండలంలోని సీది కూడలి నుంచి పాశిగంగుపేట వరకు ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలకు, పెద్దలోగిడిలోనూ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో కొంతమంది పంచాయతీ కార్యాదర్శులు, వీఆర్వోలు ఫ్లెక్సీలు తొలగించినప్పటికీ, మరికొన్ని ఫ్లెక్సీలు గ్రామాల్లో ఇప్పటికీ అలాగే ఉన్నాయి.

78 మందికి కంటి పరీక్షలు

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన 78 మందికి కంటి పరీక్షలు చేశారు. 36 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వైద్యులు దివ్య, అనురాధ, పీఆర్వో లక్ష్మణ్, గ్రామ పెద్దలు బలగ శంకర్ భాస్కర్, ఖండాపు శ్రీనివాసరావు, కొంచాడ చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

32 మద్యం బాటిళ్ల స్వాధీనం

జలుమూరు: మండలంలోని పెద్దదూగాంలో అక్రమంగా మద్యాన్ని నిల్వ చేసిన అదే గ్రామానికి చెందిన తర్ర రామారావుపై కేసు నమోదు చేసినట్లు కోటబొమ్మాళి ఎక్సైజ్ సీఐ గాయిత్రి బుధవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి రామారావు ఇంటిలో 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేశామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రైతుకు అందుబాటులో ఉండాలి

ఎల్.ఎన్.పేట: గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ పైడి లతశ్రీ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో వ్యవసాయశాఖ సహాయకులతో సమావేశమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరిసాగుతోపాటు మొక్కజొన్న ఇతర పంటలు పండిస్తున్నారన్నారు. ఆయా రైతులకు అందుబాటులో ఉండి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. రైతులుతో కలిసి పంట పొలాలకు వెళ్లి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు చేయాలన్నారు. పంటలను ఆశించే తెగుళ్లను గుర్తించేలా రైతులుకు అవగాహన పెంచాలన్నారు.

'గాదె'కు మద్దతుగా నిలవండి



హిరమండలం: హిరమండలంలో ఉపాధ్యాయులను కలిసిన గాదె శ్రీనివాసులనాయుడు

నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడును గెలిపించాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి అన్నారు. మండలంలోని మడపాం, మాకివలస, నరసన్నపేటతోపాటు పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శ్రీనివాసులు నాయుడుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. శ్రీనివాసుల నాయుడుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఏపీటీఎఫ్ సహాధ్యక్షుడు సి.హెచ్.దిలీప్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జె.బాబూరావు, రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ప్రతినిధులు కె.లక్ష్మణరావు, ఆర్.అప్పలనాయుడు, పి.రమేష్, ఏపీటీఎఫ్ 1938 ప్రతినిధులు బి.కేశవరావు, బి.కటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం..

హిరమండలం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాదె శ్రీనివాసుల నాయుడు బుధవారం ప్రచారం చేపట్టారు. స్థానిక కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గులుమూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయులను కలిశారు. ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. గతంలో ఎమ్మెల్సీగా సేవలందించానని, విద్యారంగంతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు తనకే వేయాలని కోరారు. పీఆర్‌టీయూ ప్రతినిధి హరిశ్చంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



ఆమదాలవలస: దివంజిపేటలో గోవిందరావును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్



ఆమదాలవలస: బాలసుందర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్, నాయకులు

సారవకోట: మండలంలోని అన్నుపురం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ ఎడ్ల అసిరయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. చిన్నగుజ్జువాడ గ్రామానికి చెందిన కొండాల విశ్వనాథం ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, కిడిమి గ్రామానికి చెందిన రొక్కం అప్పారావు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, నక్క తులసీదాస్, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, శంకరబాబు, సాధు సతీష్, కొండాల బాబూరావు, గెల్లంకి వెంకటరావు తదితరులు ఉన్నారు.

జలుమూరు మండలంలో..

జలుమూరు: మండలంలోని లింగంన్నాయుడుపేటలో ఇటీవల మృతి చెందిన ధర్మాన లక్ష్మమ్మ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పరామర్శించారు. సర్పంచ్ ధర్మాన అనిత, కుటుంబ సభ్యులు ధర్మాన జగన్, రమణమూర్తికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు వాన గోపి, ఆరంగి మురళి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, ముద్దాడ బైరాగినాయుడు, దామ మన్మధరావు, పైడి విఠల్ రావు తదితరులు ఉన్నారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస రూరల్: మండలంలోని బొబ్బిలిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రయ్య మృతి బాధాకరమని మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. చంద్రయ్య స్వగ్రామం బొబ్బిలిపేట వెళ్లి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. జెడ్పీటీసీ బెండి గోవిందరావు భార్య (వంజంగి సర్పంచ్) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, తమ్మయ్యపేటలో కలివరం మాజీ సర్పంచ్ గురుగుబెల్లి అప్పారావు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, వైస్ ఎంపీపీ జగన్నాథం, కోట రమణ, గురుగుబెల్లి గిరి, ఎంపీటీసీ సభ్యులు కుటికుప్పల సన్యాసిరావు, తాంద్ర ధనుంజయ్‌రావు, బొడ్డేపల్లి మన్మధరావు, పైడి వెంకటరమణ, పొన్నాడ రాము, హరినాథరావు సురేష్, వసంత, బొడ్డేపల్లి రాజు, తదితరులు ఉన్నారు.

బాలసుందర్ కుటుంబానికి..

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డుకు చెందిన కుక్కటాల బాలసుందర్ భార్య భాగ్యలక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యాంప్రసాద్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముత్తా విజయ్, శిల్లా మల్లిఖార్జునరావు, అత్తులూరి రవికాంత్, సాధు కామేశ్వరరావు, రాజాపంతులు రాజాబాబు, సాధు చిరంజీవిరావు, హేమంత్, గోలివి పురుషోత్తం, తదితరులు ఉన్నారు .

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి..

ఆమదాలవలస: మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యం కారణాలతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. అక్కివరం గ్రామానికి చెందిన గురుగుబెల్లి నీలారావు, దివంజీపేటకు చెందిన గోవిందరావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అవగాహన



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని, ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలని టెక్కలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రహదారి భద్రతా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.లత, ఏఎస్ఐ అసిరినాయుడు, నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి దంత వైద్య నిపుణుడు రమేష్ నాయుడు, అధ్యాపకులు రవికుమార్, అన్నాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

ఆవిష్కరణ



పాతపట్నం మహేంద్రతనయ నదీ తీరాన ఉన్న నీలకంఠేశ్వర స్వామిని ముంబైకి (మహారాష్ట్ర) చెందిన జీఎస్టీ కమిషనర్ (ఐఆర్ఎస్) పూజారి కృష్ణారావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రుద్రపంక్తి పార్వతీశం ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న మహాశివ రాత్రి మహోత్సవాల పోస్టర్‌ను కృష్ణారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. సుదర్శన్, అర్చకులు కల్యాణస్వామి, తేజ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

– పాతపట్నం

అభినందన..



నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు పొందిన 8 మంది విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు నగదు ప్రోత్సాహకం అందించి అభినందించినట్లు ప్రిన్సిపాల్ ఎం.పవన్ బుధవారం తెలిపారు. ప్రిన్సిపాల్ పవన్, విశ్రాంత ప్రిన్సిపాల్ నారాయణ స్వామి, ఉత్తమ అధ్యాపకుడు అప్పన్న మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను ప్రోత్సాహించడం అభినందనీయన్నారు. ద్వితీయ సంవత్సరంలో కూడా మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు సత్యనారాయణ, సోమశేఖర్, డాక్టర్ మల్లేసు, రాంప్రసాద్, రవి, కె.హరినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

– నరసన్నపేట

అవస్థలు..



బూర్జ మండలంలోని మామిడివలసలో రహదారికి ఇరువైపులా మురుగునీటి కాలువలు లేవు. దీంతో రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. నిత్యం రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మురుగునీటి కాలువలు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– బూర్జ

సాగునీటికి అష్టకష్టాలు



ప్రకాశరావుపేట వద్ద వేరుశనగ పంట కోసం పైపుల ద్వారా నీటిని తరలిస్తున్న దృశ్యం

పోలాకి: వంశధార శివారు కాలువల పరిధిలో సాగునీటికి రైతులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మేఘవరం ప్రధాన కాలవకు సంధానంగా ఉన్న ప్రియాగ్రహారం, డీఎల్‌పురం, చీడివలస, కోడూరు చానళ్ల పరిధిలోని వందల ఎకరాల్లో వేరుశనగ పంట పూత, పిందె దశలో ఎండిపోవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ చెరువులు, నేలబావుల్లో నీటి ఇంజిన్ల సహాయంతో సుదూర పొలాలకు సైతం పైపులేసి నీటిని తరలిస్తున్నారు. వంశధార ద్వారా ఒకసారైనా సాగునీరు అందించాలని నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని రైతులు చెబుతున్నారు. ఇదేకొనసాగితే పంట చేతికి రావటం కష్టమని, అవకాశం ఉన్నంతవరకు పంటను కాపాడేప్రయత్నం చేస్తున్నామన్నారు.

తెగిన విద్యుత్ తీగలు

- విద్యుత్ సరఫరాకు అంతరాయం



మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ఆమదాలవలస: మండలంలోని పొన్నాంపేట గ్రామం సమీపంలో గల కొండల్లో విద్యుత్ తీగ లు బుధవారం తెగాయి. పొన్నాంపేట, రామచంద్రపురం, చిట్టివలస, గుంటవానిపే, ఆనందపురం తదితర గ్రామాలకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆయా గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడ్డారు. విద్యుత్ తీగలు తెగిన వెంటనే పొన్నాంపేట గ్రామానికి చెందిన కొంతమంది మేకల కాపరులు ఈ సమాచారాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు అందించారు. వారు అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. కొండ ప్రాంతంలో తీగలు తెగిపడడంతో ఆ ప్రాంతంలో ప్రజలు ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పిందని చర్చించుకుంటున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది పనులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.